క్లుప్తంగా

యాప్‌లోనే అనుమతులు, ఫిర్యాదులు

భద్రాచలంఅర్బన్: ఎన్నికల సభలు, సమావేశాలకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేయాలని, సమస్యలు ఉంటే సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. దరఖాస్తు చేసిన వంద నిమిషాల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లర్లు చేయడం, అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలను అడ్డుకోవడం వంటివి చేయరాదు అన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, నాయకులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రచార రథం ప్రారంభం

దుమ్ముగూడెం: భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ తెల్లం వెంకట్రావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచార రథాన్ని ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మలు జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నే సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు, నాయకులు దామెర్ల శ్రీనివాసరావు, అల్లాడి వెంకటేష్, జిలకర గంగరాజు, కొత్తూరు సీతారామారావు, కొండపల్లి నరేంద్ర,నడికుడి ఎంపీటీసీ సోడే తిరుపతిరావు, పెదనల్లబల్లి ఉపసర్పంచ్ మడకం భూపతిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరగాలి

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా మాతా, శిశుసంరక్షణ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మాతా, శిశువులకు అందిస్తున్న వైద్య సేవల గురించి మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందికి మాతా, శిశు సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ఎస్తేరురాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌ఈ శారారాణి, హెచ్‌ఎస్ నాగేశ్వరరావు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీల్లో చేరిక

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో దమ్మపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని నివాసంలో దమ్మపేట గ్రామానికి చెందిన యువకులకు, ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. యార్లగడ్డ శ్రీను, మధు, గణేష్, సాయి, మిడతా శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జారే ఆదినారాయణ సమక్షంలో మండలంలోని పలువురు వార్డు మెంబర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం మండలంలోని దమ్మపేట, మందలపల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు చీదర నాగమణి, సోడెం సీతా, కొర్సా పోలమ్మ, తొలెం లక్ష్మి, సోయం క్రుష్ణవేణి తదితరులు అల్లిపల్లి గ్రామంలో జారే చేతులమీదుగా పార్టీ కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అలపాటి ప్రసాద్, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, సాయిల నర్సీ, ఆకుల క్రుష్ణారావు, యర్రగొర్ల రాధక్రుష్ణ, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

దుమ్ముగూడెం: మండలంలో వర్షాభావం ప్రభావంతో ఎండిపోయిన పంటలను ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం రేగుబల్లి గ్రామంలో ఎండిపోయిన పంటపొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేగు బల్లి గ్రామంలో పత్తి చేలు వర్షాలు లేక తాలిపేరు ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ నీళ్లు లేక పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. దామర్ల సోమరాజు పడిదల కృష్ణంరాజు, వల్లెపోగు సురేష్,కాల్వ వెంకటేశ్వర్లు, పడిదల నరసింహారావు, వల్లెపోగు రాంబాబు,పేరాల శ్రీకాంత్, భోగాల రాంప్రసాద్ పాల్గొన్నారు.

మద్దతుదారులకే పట్టం

భద్రాచలంఅర్బన్: ఏఐటీయూసీ, సీపీఐ మద్దతు తెలిపే రాజకీయ పార్టీలకే భద్రాచలం నియోజవర్గంలో పట్టం కట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. భద్రాచలం పట్టణ ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం సీనియర్ నాయకులు బత్తుల నరసింహులు అధ్యక్షతన మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికవర్గ దృక్పథం ఉన్న రాజకీయ పార్టీలకే కార్మిక వర్గం మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు మారెడ్డి శివాజీ, ఏఐటీయూసీ పట్టణ కన్వీనర్ రాయల రాములు, పట్టణ కోకన్వీనర్ లంకపల్లి విశ్వనాథ్, చాడ శోభన్ బాబు, గుంజ చెన్నకేశవ, వింజం నాగసాయి, జక్కం గోపి, చిట్టిమల్ల అనిల్, బైరు వరలక్ష్మి, గాడిద భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ బంక్ బంద్

- 10 నెలలుగా నిలిచిపోయిన విక్రయాలు
- నిధుల మళ్లింపే కారణమా?
- విచారణ జరిపేందుకే అమ్మకాలు ఆపారా?


మండలకేంద్రంలో నిరుపయోగంగా ఉన్న జీసీసీ బంక్ ఇదే

ములకలపల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గిరిజన కో–ఆపరేటివ్ బంక్ ఉన్నప్పటికీ లేనట్లుగానే ఉంది. ఈ బంక్‌లో పది నెలలుగా ఆయిల్ విక్రయాలు జరుగడం లేదు. దీంతో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన బంక్ నిరుపయోగంగా మారింది. ఆయిల్ క్రయవిక్రయాలకు సంబంధించి రూ.50 లక్షల పైచిలుకు నగదు మాయమయ్యాయని, బంక్ నిలిచిపోవడానికి ఆదే ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ కొనసాగుతోంది..

బంక్‌కు సంబంధించి క్రయవిక్రయాలు, ఇతర నగదు విషయాలపై విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. తుది నివేదిక రాగానే ఆ మేరకు ఉన్నతాధికారుల సూచనలు చేస్తారు. ఆపై దీనికి సంబంధించిన విషయాలు వెల్లడిస్తాం. బంక్ నిర్వహించేందుకు ఫైనాన్స్ ఏర్పాటు చేయాల్సింగా హెడ్ ఆఫీస్ అధికారులను అభ్యర్థించాం. అమౌంట్ రాగానే తిరిగి అయిల్ అమ్మకాలు మొదలుపెడతాం.

– లక్ష్మోజీ, జీసీసీ మేనేజర్, పాల్వంచ

ఆరోపణల నేపథ్యంలోనే..

పాల్వంచ–మండలపల్లి ప్రధానరహదారిపై తహసీల్దార్ కార్యాలయ సమీపంలో 2018లో బంక్ ఏర్పాటు చేశారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన 6గురు పని చేస్తున్నారు. ప్రతీరోజూ లక్షలాది రూపాయల డీజిల్, పెట్రోల్ విక్రయాలు జరిగేవి. జీసీసీకి ఆర్థికంగా బలోపేతంగా నిలుస్తుందనుకుంటున్న తరుణంలో క్రమంగా ఆయిల్ అమ్మకాలు ఆగిపోయాయి. ఈ క్రమంలో బంక్ తాత్కాలికంగా మూతపడిపోయింది. గత పదినెలల కాలంగా మూతపడే ఉంది. ఇక్కడి లావాదేవీల స్వాహా ఉదంతంపై గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించి లక్షలాది రూపాయలు దారి మళ్లించినట్లు, వాటిపై స్పష్టత వచ్చేవరకూ క్రయవిక్రయాలు నిలిచిపోయినట్లు తెలిసింది. ఈ బంక్‌లో అరకోటి వరకూ అవినీతి జరగనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి లోగుట్టు వెలుగులోకి తేవాలని, వాస్తవాలు వెలికితీయాలని పలువురు కోరుతున్నాయి.

పకడ్బందీగా కోడ్ అమలు


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ నాగరాజు రెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు చెక్ పోస్టులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాల తనిఖీ విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని, ప్రతీ వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు. డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. రూ.50వేలకు మించి తీసుకెళ్లే నగదుకు తప్పనిసరిగా అవసరమైన పత్రాలు చూపించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట టౌన్ ఎసస్సై పీవీఎన్ రావు, మధు ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నిరంతర పోరాటం


మణుగూరుటౌన్: జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్

అశ్వాపురం: 1920 అక్టోబర్ నుంచి నేటి వరకు కార్మికుల చట్టాలు, హక్కులపై ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు సాగిస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ అన్నారు. మండల పరిధిలోని మొండికుంటలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి అరుణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోరెం శ్రీలత, నాయకులు హంసవేణి, శైలజ, కళావతి, సుశీల, రజిత, రమణ, పుల్లమ్మ, రమణ, పద్మ, సుగుణ, నాగమణి, సాహితి, దీప్తి, మంగతయారు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పీవీకాలనీలోని ఎల్.మహేంద్ర భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ జెండాఆవిష్కరించి మాట్లాడారు. 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఏఐటీయూసీ దేశంలోని కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడిందని గుర్తు చేశారు. ఎనిమిది గంటల పని విధానం, పేమెంట్ యాక్ట్, పెన్షన్, గ్రాట్యుటీ చట్టం, పబ్లిక్ రంగ సంస్థల ఏర్పాటు, పెట్టుబడి దారీ విధానంపై పోరాటం అనేక సమస్యలపై పోరాడి విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల రామనర్సయ్య, ఆవుల నాగరాజు, గుంపెన శ్రీనివాసరావు, ఆంటోని రవికుమార్, మన్నెం యోహన్, బొక్క శ్రీనివాస్, దాచి భాస్కర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి


మణుగూరుటౌన్: కార్మికులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకుడు ప్రభాకర్‌రావు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని అన్ని గనుల డిపార్ట్‌మెంట్ల కార్మికులు రేపు సాయంత్రం పీవీకాలనీలో జరిగే జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని టీబీజీకేఎస్ నేత వీ.ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో పర్యటించి కార్మికులను కలిసిన ఆయన మాట్లాడారు. అసెంబ్లీ, సింగరేణి ఎన్నికల్లో బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించే విధంగా టీబీజీకేఎస్ కేంద్ర నాయకత్వంతో పాటు మహబూబాద్ ఎంపీ మాలోతు కవిత, స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమావేశానికి రానున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలు హాజరవ్వాల్సిందిగా కోరారు.

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీ కమ్యూనిటిహాల్‌లో ఈ నెల 2వ తేదీన జరిగే టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు మంగళవారం విజ్ఞప్తి చేశారు. 2వ తేదీ సాయంత్రం 5గంటలకు టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. యూనియన్ నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'పేట'లో పోటీకి సిద్ధం

ములకలపల్లి: పొత్తులు కుదరనిపక్షంలో అశ్వారావుపేట స్థానానికి సీపీఎం అభ్యర్థి పోటీలో ఉంటారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య స్పష్టం చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు నిమిత్తం కాంగ్రెస్ పార్టీలో చర్చలు జరుగుతున్నాయని, చర్యలు ఇంకా తుదిదశకు రాలేదన్నారు. చర్చలు విఫలమైతే పేట బరిలో ఖచ్చితంగా ఉంటామని అన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు ఊకంటి రవికుమార్, గోపగాని లక్ష్మీనర్సయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయితీ సంతోష్‌నగర్‌లో ఉన్న బాలవెలుగు పాఠశాలకు పీకేఓసీ–2 రిలే–సీలో పని చేస్తున్న డంపర్ ఆపరేటర్ షేక్ మహబూబాబ్ జానీ–షబానా దంపతులు వారి కుమారుడు అమన్ మహీన్ జన్మదిన సందర్భంగా క్వింటా బియ్యాన్ని మంగళవారం వితరణగా అందజేశారు. అమన్ మహీన్‌తో కేక్ కటింగ్ చేసి పాఠశాల చిన్నారులకు కేక్, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాకుబ్ అలీ, ముస్తఫా, ఖాజా మొహియుద్దీన్, సలీమా, షమీనా, మెహరున్నీసా, సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డి, సుహాసినిదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

కరకగూడెం: మండలంలోని బుర్థారం గ్రామంలో మంగళవారం కరకగూడెం ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. శిబిరంలో సుమారు 70 మంది రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మానవ సేవ వృద్ధాశ్రమంలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు రాకేష్ ఆశ్రమంలోని వృద్ధులకు జ్వరం, కీళ్లనొప్పులు, విరోచనాలు, దగ్గు, జలుబు, ఆయసం, అజీర్ణం వంటి పలు రకాల వ్యాధులకు పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 90 మందికి వైద్య పరిక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో ఫార్మసిస్ట్ వీరయ్య ఆశ్రమ నిర్వాహకులు రఫీ, సరోజమ్మ పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యం..

చర్లరూరల్: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో హోమియో వైద్య శిబిరాన్ని మంగళవారం చర్ల మండలంలోని పశువుల ఆస్పత్రి ఏరియాలో నిర్వహించారు. 52 మందికి వైద్య పరీక్షలు చేసిన హోమియోపతి వైద్యురాలు పూజ.. వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ఆశాకార్యకర్త హైమ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడి తండ్రిని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. మంగళవారం బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్ తండ్రి చిన్నవెంకటేశ్వరరావును సత్తుపల్లిలో ఎమ్మెల్యే మెచ్చా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, బాల శ్రీను, మండవ సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, తాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రక్షణ లేకుండా ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్స్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఫ్యూజ్ బాక్స్ రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందల సంఖ్యలో అటు ఇటు రహదారి దాటుతున్న ప్రజలకు దీని ద్వారా ప్రమాదం పొంచి ఉంది. అదే విధంగా భద్రాచలంలో పశువులు అధిక సంఖ్యలో రోడ్డు మీదనే నిద్రిస్తున్నాయి. ఈ క్రమంలో ఆ పశువులు ఈ విద్యుత్ బాక్సును తాకితే మృతిచెందే అవకాశం ఉందని జంతు ప్రేమికులు వాపోతున్నారు. వీలైనంత త్వరగా అధికారులు స్పందించి తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పటేల్ సేవలు అమోఘం


మణుగూరురూరల్: వల్లభాయ్ పటేల్‌కు నివాళ్లర్పిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్: భారతదేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు అమోఘమైనవని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) సీఈ బి.బిచ్చన్న అన్నారు. మంగళవారం బీటీపీఎస్‌లో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఈ బిచ్చన్న వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతావనిని ఏకత్రాటిపై నడిపించిన వల్లభాయ్ పటేల్‌జీవితం మనందరికి ఆదర్శప్రాయం అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మనందరం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్మిక సంఘాల సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లులర్పించి, విద్యార్థులతో రాష్ట్రీయ ఎక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ చైతన్య బృందం విద్యార్థులకు వైద్య పరీక్షలతో పాటు బ్లడ్ గ్రూప్ చెకప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, జయప్రసాద్, స్వప్న, వసుందర, నాగకుమారి, సబితా పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



బూర్గంపాడులో పోలీస్ అమరవీరుల సంస్మరణ ర్యాలీ

బూర్గంపాడు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం బూర్గంపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవలో భాగంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన పోలీసుల సేవలు చిరస్మరణీయమన్నారు. యువత క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బర్ల తిరుపతిరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్యా, నరేశ్‌కుమార్, శ్రీనివాస్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా పార్టీల ప్రచారం


కరకగూడెం: ఓటర్లకు మేనిఫెస్టో అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


చర్ల: తిమ్మిరిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుండాల: తెలంగాణా రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీనే గెలిపించాలని, బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ మండల నాయకులు మోకాళ్ల వీరస్వామి. ఎస్‌డి.అజ్జు అన్నారు. మంగళవారం కారు గుర్తుకే ఓటు వేయాలని, రేగా కాంతారావునే గెలిపించాలని కోరుతూ పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లగా రాష్ట్రంలో, నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గురించి వివరించారు.

కరకగూడెం: సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష అని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసిన రేగాను గెలిపించాల్సిందిగా కోరారు. అనంతరం పార్టీ మేనిఫెస్టోను ఓటర్లకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్..

చర్ల: మండలంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంత గ్రామాల్లోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. భద్రాచలం శాసన సభకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్న పొదెం వీరయ్య గెలుపు కోరుతూ పార్టీ టీపీసీసీ సభ్యుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు కె.విజయకుమార్ నాయుడు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కారంపూడి సాల్మన్‌రాజు తదితరులు మంగళవారం మండలంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లోని తిమ్మిరిగూడెం, రాళ్లాపురం, కిష్టారంపాడు, కమలాపురం తదితర గ్రామాల్లో పర్యటించి మేనిఫెస్టోను వివరించారు.

విభేదాలు.. అవాస్తవం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు కొందరు సీనియర్లను కలుపుకుపోవడం లేదని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆ పార్టీమణుగూరు మండల అధ్యక్షుడు నవీన్ స్పష్టం చేశారు. మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యలాపాలు చేస్తున్నడనే కారణంతో గతంలో మణుగూరు మండల అధ్యక్షుడిగా పనిచేసిన గురజాల గోపిని కాంగ్రెస్ పెద్దలు సస్పెండ్ చేశారని, ఈ కారణం చేతనే అతనికి పాయం కొంత దూరంగా ఉన్నారని తెలిపారు. గోపితో కలవనంత మాత్రాన సీనియర్లందరినీ పాయం కలుపుకుపోవడం లేదని ప్రచారం చేయడం హాస్యాస్పదం అన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోబోమని, భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కేవీ.రావు, పుచ్చకాయల శంకర్, కనకయ్య, తాటి భిక్షం, శివ, పాషా, బల్లెం సురేశ్, రాజేశ్, దొడ్డపనేని మధు, ఆదిలక్ష్మి, మానస, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మండల నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

భారతదేశ ఉక్కు మహిళ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన మహానాయకురాలు ఇందిరమ్మ అని, ఆమె ఆశయాలను ఎప్పటికీ మరవబోమని అన్నారు. ఇందిరమ్మ ఇంటితోనే పేదల ప్రజల కలలు నెరవేరాయని, ఆమె పాలనలో భారతదేశం అభివృద్ధి చెందిందని అన్నారు. – సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంటౌన్: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


చంద్రుగొండ: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


అశ్వాపురం: నివాళులర్పిస్తున్న తుక్కూరి బ్రహ్మయ్య, నాయకులు